


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుణ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

3

**తన మొదటి** కథను అతడే పత్రికకీ పంపించలేదు. అంటే దీని అర్థం ఆ కథ గురించి పూర్తిగా మరచిపోయాడని కాదు. తర్వాత చదువుకుంటే అందులో ఎన్నో తప్పులు కనిపించాయి. ఏదోతెలియని గొప్పతనం అందులో వున్నట్లు తోచేదిగాని. అదేమిటో మనసుకి తట్టేదికాదు. అదీగాక అతనికి చిన్నప్పటినుంచీ పద్యాలంటే తలనొప్పి, వేమన పద్యాలూ,

సుమతీ శతకమూ చదవకుండానే అతని ఎలిమెంట్రీ స్కూలు చదువు పూర్తయింది. పద్యాలు వంటపట్టక పోవటం వలన భాష స్వాధీనం అయ్యేదికాదు.

ఎప్పటికప్పుడు కొత్తగా, తడుముకున్నట్లుగా ఉండేది. అయితే అతను ఎనిమిది తొమ్మిది సంవత్సరాల వయస్సులో వున్నప్పటినుంచీ కథలూ, నవలలూ విరివిగా చదివేవాడు. తోపుడు బళ్ళలో ఆరణాలకొచ్చే నవలలూ, ఇంటింటికి తెచ్చి అమ్ముతూ, అద్దెకిస్తూ వుండేవాళ్ళు. మధుబాబు తల్లి సుందరమ్మగారికి యీ నవలల పిచ్చి జాస్తీగా వుండేది. అప్పట్లో ఎక్కువగా కొవ్వలి, జంపన నవలలు వచ్చేవి. మధుబాబు అవి ఆసక్తిగా చదివేవాడు. తండ్రి చూడకుండా పాఠ్యపుస్తకాల క్రింద పెట్టుకుని చదువుతూ వుండేవాడు. కర్మంకాలి విశ్వనాధంగారు ఎప్పుడయినా చూడటము తటస్థిస్తే తల వాచేటట్లు చివాట్లు పెట్టేవాడు.

ఆయనకు తనబిజినెస్ గొడవ, ఊళ్ళు తిరగటం యిది తప్ప యీ సాహిత్యం, పుస్తకాలు ఏమీ పట్టేవికావు. కొడుకు యీ పుస్తకాలు చదివితే పాఠాల్లో వెనకబడిపోతాడని భయం. అందుకని ఆయన కంటబడినప్పుడు కోప్పడడమే గాకుండా ఓ ఘడియపోయాక దగ్గరకు పిలిచి, ఆ వయసులో ఆటపాటలూ చదువు సంధ్యలూ తప్ప కుర్రాళ్ళకి మరే వ్యాపకాలూ వుండకూడదని ఓ గంటసేపు ఉపన్యాసం యిచ్చేవాడు. మధుబాబు క్షణంలో అదంతా మరచిపోయేవాడు. అతనికీ పుస్తకాలు నచ్చుతున్నాయి. గొప్పగా వున్నాయి. అవి చదువుతుంటే ఊహాలోకంలో ఓ తన్మయత్వంలో తేలిపోయేవాడు. ఈ అనుభూతిని చూస్తూ వదులుకోలేడు. సాయంత్రాలు డాబామీద చేరి క్రిష్ణ ఒడ్డున కూర్చుని చదువుతూ వుండేవాడు. సుందరమ్మగారు అతన్ని ఎప్పుడూ మందలించలేదు. మధుబాబు చదవటమే గాకుండా పెద్దయి సంపాదనా పరుడయాక యీ పుస్తకాలన్నీ మళ్ళీ తెప్పించి బైండు చేయించి యింటిలో అలంకరించాలని ఉవ్విళ్ళూరుతూ ఉండేవాడు.

ఆ రాత్రి రాసిన కాయితాలు జాగ్రత్తగా డ్రాయరు సొరుగులో దాచుకున్నాడు. స్నేహితులైతే చాలామంది వున్నారుగానీ నవ్వుతారనీ ఎగతాళి చేస్తారనీ ఈ విషయం చెప్పలా. క్లాసులో ఎప్పుడూ పరధ్యానంగా ఉండటం, నోట్సులనిండా ఏదో వ్రాస్తూ వుండటం, ఓ మిత్రుడు చూసి "వీడు ఎప్పటికయినా గొప్ప కథకుడు అవుతాడ్రా" అని నిజాయితీగా పలికేసరికి ప్రక్కవాళ్ళంతా "వీడి మొహం, వీడా?" అని ఎద్దేవా చేసేవారు. అందుకని ఎవరికీ చూపించలేదు. ఓ రోజున విశ్వనాధంగారు కొడుకు ఇంట్లో లేనప్పుడు పెన్సిల్ కావల్సివచ్చి డ్రాయరు సొరుగు వెదుకుతుండగా ఆ కాయితాలు కనిపించాయి. అవేమిటో తెలుసుకుని నిర్ఘాంతబోయి నిలబడ్డాడు, కాస్త చదివాడు. కోపంతో మండిపడి గబగబా భార్య దగ్గర కొచ్చాడు. "చూడు, నీ కొడుకు చేస్తున్న ఘనకార్యం. వీడు కథలు కూడా అఘోరిస్తున్నాడు. ఇలా అయితే బాగుపడ్డట్లే. ఇదంతా నీ ట్రయినింగ్. నువ్వే వాడిని పాడుచేస్తున్నావు" అని కేకలు పెట్టాడు.

వంటచేస్తున్న సుందరమ్మగారు తెల్లబోతూ ఇటు తిరిగి "మధ్య నేనేం చేశానండీ?" అంది లేచి నిలబడుతూ.

"ఏడిశావ్ ఇదంతా చేసింది నువ్వుకాదూ. అడ్డమైన పుస్తకాలూ తెప్పించి నీ పిచ్చి వాడికికూడా అంటగట్టావు. ఏడిశాడు ఎక్కడున్నాడు? ఇదిగో చెపుతున్నా, ఈసారి ఆ వెధవ పుస్తకాలు చదువుతూ కనిపించారంటే వాటిని చించిపారేస్తాను. ఏమనుకుంటున్నారో" అని పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత మధుబాబును శిక్షించడం జరిగింది. అలసట చెందాడు మధుబాబు.

నానీ చావు తెచ్చిన విషణ్ణ వాతావరణం క్రమంగా అంతరించింది. దేశంలో హిందూ ముస్లిం తగాదాలు కూడా సర్దుకున్నాయి. కులాసాగా వున్నట్లు సరస్వతి ఢిల్లీ నుంచి ఉత్తరం రాసింది.

మధుబాబు స్కూలు ఫైనల్ పరీక్షలకు శ్రద్ధగా చదవసాగాడు.

4

మధుబాబు కాలేజీలో చేరాడు. ఆ వాతావరణం మొదట్లో చాలా కొత్తగా కనిపించింది. కాలేజీ లైఫ్ చాలా మధురంగా వుంటుందని ఇదివరకు చాలామంది అంటూంటే విన్నాడు. మొదటి రెండుమూడు నెలలూ అదేమిటో అతనికి అంతుపట్టలేదు. అదీగాకుండా అతడు తీసుకున్నది సైన్సు గ్రూప్ కాబట్టి బొత్తిగా తీరికలేకుండా, చికాగ్గా వుండేది. మిగతా గ్రూపులవాళ్ళు ఉషారుగా, నిర్లక్ష్యంగా తిరుగుతూ ఉండేవాళ్ళు. కేంటిన్‌లోనూ చెట్లక్రింద గుంపులుగా కూర్చుని అల్లరి చేస్తూండేవాళ్ళు, వాళ్ళని చూస్తే అసూయగా ఉండేది మధుబాబుకు.

ఇంతలో కాలేజీ ఎలక్షన్లొచ్చాయి. కాలేజి అంతా హడావుడిగా నిండిపోయింది. విద్యార్థుల హక్కుల్ని కాపాడటానికంటూ కొంతమంది ప్రతినిధులు బయల్దేరారు. క్లాసుల్లోకి పోవటం, కాళ్ళు వొణుకుతుండగా ఉపన్యాసాల లాంటివి యివ్వటం, కూర్చున్న వారిలోంచి అవతలి వర్గం వారు లేచి అల్లరి చేయటం, ఉభయపక్షాలవారూ ఒకరినొకరు వార్నింగు లిచ్చుకోవటం, తన్నులాటలు, రాజీలు యిట్లా వుంది వాతావరణం.

మధుబాబుకు యీ తతంగమంతా చికాకు కలిగించింది. ఉభయ పక్షాలలోనూ ఎవరు కూడా అతనికి అయినవారు కారు. అందుకని పట్టించుకోకుండా ముభావంగా చూస్తూ ఊరుకున్నాడు.

ఎన్నికలు ముగిశాక కాలేజి మేగ్‌జైన్‌కి విద్యార్థుల్నుంచి సంపాదకుల్ని ఎన్నుకునే నిమిత్తం పోటీ జరిగింది. మధుబాబుకు వున్న వ్యాపకం తెలిసిన వాళ్ళెవరో యీ సంగతి అతని చెవిలో ఊది "ప్రయత్నించు, పోయినదేముంది?" అని సలహా ఇచ్చారు. అతన్లో ఆశ మొలకెత్తింది.

"నిజమే మంచి సంగతి"

అతను పోటీలో పాల్గొన్నాడు. అంశం ఏమిటంటే "ప్రజాకవిత్వమంటే ఏమిటి?"

అతని ఉత్సాహం చచ్చిపోయింది. ఈ కవిత్వం గురించి తనకు బొత్తిగా తెలియదు ప్రజా కవిత్వమట. బహుశా ప్రజా సమస్యలకు చేరువుగా వున్న కవిత్వమయి వుంటుంది. మరి దాని లక్షణాలమాటో? అతనికి అంతుపట్టలేదు. ఇష్టం వచ్చినట్లు రెండు పేజీలు వ్రాసి బయటికొచ్చేశాడు. ఫలితం ఏమంటే అతను సెలక్టు కాలేదు.

అతనికి కోపం వచ్చిన మాట నిజమేగాని వీళ్ళ మొహంవీళ్ళు నా అర్హతని కొలిచేవాళ్ళా? అన్నట్టు పోజు పెట్టి సంతృప్తి పడటం వగైరాలు ఏమీ చేయలేదు. మంచి అవకాశం చెయ్యిజారిపోయినట్లు బాధపడ్డాడు. కాలేజీలో తాను షైన్ అయ్యే ఛాన్స్ చెయ్యిజారిపోయింది.

ఆ ఛాన్స్ అతనికి వేదిక మీద ఎక్కి ఉపన్యాసాలు దంచినా, నాటకాలలో నటించినా వచ్చి వుండేది. కాలేజి వాతావరణంలో నిర్భయంగా స్టేజి మీదకు ఎక్కు నాలుగు ముక్కలు చెప్పగలిగిన వాడే స్పీకర్ క్రింద చలామణి అవుతాడు. చెప్పేదాంట్లో పెద్ద స్టఫ్ వుండనక్కరలేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే స్టేజిఫియర్ లేకపోతే అతను స్పీకర్ అయిపోయాడన్నమాట. మధుబాబుకు ఈ సమాచారం ఏమీ నచ్చలేదు. ఈ మాట్లాడే వారందరికంటే తనకు చాలా ఎక్కువ విషయాలు తెలుసు. కాని వాటికో స్వరూపం ఇవ్వలేని స్థితిలో నలుగురి ముందూ బడబడలాడటము వాచాలత అనిపించుకుంటుందని తన ఉద్దేశం.

అతనికి పుస్తకపఠనం ఎక్కువయింది, ఆటపాటల్లో అభిరుచి లేకపోవటం వల్ల టైమంతా కొత్తపుస్తకాలు చదవటంలో గడిపేవాడు.

దానితోపాటు రాయాలన్న జిజ్ఞాస కూడా అధికం కాసాగింది. ఏమి రాయాలో తెలీకుండానే పేజీలకు పేజీలు రాసివేయసాగాడు. అతని మనస్సులో ఎప్పుడూ ఏదో ఆలోచన మెదుల్తూ వుండేది. రాత్రంతా నిద్రలేకుండా ఆలోచనలతోనే సరిపోయేది. గంటకో నూతన యితివృత్తం స్ఫురిస్తూ వుండేది. ఊహాపథంలోకి వచ్చిన ప్రతి విషయం కాగితం మీదకు ఎక్కిస్తూ వుండేవాడు. తండ్రి చూడకుండా డాబామీదకు ఎక్కి గది తలుపులు బిడాయించుకుని, లేకపోతే కాలేజీలో ఖాళీగా

వున్న క్లాస్ రూమ్స్ లో కూర్చుని రాసేస్తూ వుండేవాడు. ఒక నెల్లో పదిహేను కథలు తయారు చేశాడు. తరువాత అవి చూసుకుని "అబ్బా! యివన్నీ నేనే రాశానా?" అని నివ్వెరపోయాడు. వాటిని ఇంట్లో పెట్టుకుని పూజించటం అతని ఉద్దేశం కాదు. తన రచన, పేరు అచ్చులో చూసుకోవాలన్న తాపత్రయానికి లోటులేదు. గబగబా ఒక రోజు స్టాంపులు తెచ్చి వాటిని వివిధ పత్రికలకి పంపించేశాడు. పత్రికలవాళ్ళ దగ్గర్నుంచి జవాబు వస్తే ఇంట్లో చూస్తారని కాలేజి ఎడ్రస్ యిచ్చాడు.

అయితే అవన్నీ అతని ఊహాలోకంలో ఎగురుకుంటూ వచ్చిన యితివృత్తాలే. వాటిలోని నిజ నిజాలు, సహజత్వం వీటిని గురించి అతనికి తెలియదు.

నెల తిరిగింది. మధుబాబు అన్నిట్లోను జాగ్రత్తగా స్టాంపులు పెట్టి పంపించటం వలన వాటి గురించి అతనికి తెలీకుండా వుండే పరిస్థితి ఏర్పడలేదు. ఒకదాని వెంట ఒకటి తిరిగి రాసాగినై. కృంగిపోవటమంటే ఏమిటో జీవితంలో మొదటిసారిగా తెలిసి వచ్చింది మధుబాబుకు. ఒక్కొక్కటీ తిరిగి వస్తోంటే కళ్ళనీళ్ళ పర్యంతం అయేది. కాని అవి మళ్ళీ చదువుతోంటే అన్నీ తప్పుల కుప్పలుగా కనిపించేవి. "ఇన్ని తప్పులు ఎట్లా రాశాను" అని సతమతమయేవాడు. అయితే అతని ఆశ్చర్యం మేరకు పంపించిన వాటిల్లో రెండు కథలు రెండు పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ఒకటి మాస పత్రిక, ఒకటి వారపత్రిక, అతని ఆనందానికి హద్దులేదు. ఒక్కొక్క కథని పదిసార్లు చదువుకున్నాడు. ఎక్కడయినా అచ్చుతప్పులు కనిపిస్తే "అయ్యో" అని నొచ్చుకున్నాడు.

ఈ అచ్చయిన కథల్లో తను ఏమీ పొరపాటు చేసినట్లు కనిపించలేదు అతనికి. పై పెచ్చు తనేరాశాడా అన్నంత ఆశ్చర్యం కలిగింది. తనకు తెలియని సంగతులు వున్నాయి వాటిల్లో చాలా. ఆ రచనలు తను ఎట్లా సృష్టించాడు...!

అతని స్నేహితులందరూ ఆ కథలు చదివారు. కానీ ఒక్కరూ మెచ్చుకున్న పాపాన పోలా. చప్పరించేశారు. పత్రికలవాళ్ళు పేజీలు నింపడానికి చెత్తాచెదారం చూసుకోకుండా యీ రోజుల్లో పబ్లిష్ చేస్తున్నారని ఒకడు తీర్మానించాడు. వేటినో దృష్టిలో పెట్టుకుని రాసినట్లుందని మరొకడు నిర్ధారణ చేశాడు. "మొదటి కథలు అంతకంటే ఏం బాగుంటాయిలే?" అని ఓ ప్రబుద్ధుడు ఓదార్పుగా అన్నాడు.

మధుబాబు ఖిన్నుడయాడు. ఒక్క ప్రాణికూడా తనని మెచ్చుకోవటల్లా. ఈ బడుద్ధాయిలందరూ అసూయని వెలిగ్రక్కుతున్నారని అతను గ్రహించలేకపోయాడు. ఆ సాయంత్రం తల్లి దగ్గరకు పోయాడు. తల దువ్వుకుంటూంటే.

"అమ్మా! నేను రాసిన కథ అచ్చయిందే" అన్నాడు.

సుందరమ్మగారు సంతోషించింది. కొడుకు ఎప్పుడూ ఏదో రాస్తుంటాడని తెలుసు కాని వారించే ప్రయత్నం ఏమీ చెయ్యలా. "ఏదీ? పత్రా చూద్దాం" అన్నది.

మధుబాబు పత్రికలు తెచ్చి, ఇచ్చాడు. ఆవిడ తలదువ్వుకోవటం పూర్తిచేసి, ఉత్సాహంగా చదివింది. ఆవిడకి అవి నచ్చాయి. కొడుకు ఎదురుగా కూర్చున్నాడు. తల్లి ముఖంలోని ఫీలింగ్స్ పరీక్షగా చూస్తూ.

ఆవిడ చివరకు తలయెత్తి చిరు నవ్వు నవ్వి "బాగున్నాయిరా" అంది. అనుభవంలేని యీ లేత వయస్సు కుర్రాడు తనకు తెలీని విశేషాల గురించి ఎట్లా రాయగలిగాడన్న అనుమానం ఆవిడ కెందుకో కలగలేదు.

మధుబాబుకు తల్లితో ఏం మాట్లాడడానికీ తోచలేదు. అతనికి సిగ్గువేసింది. మెల్లిగా అక్కడినుంచి బయటపడ్డాడు.

సుందరమ్మగారు ఈ విషయాన్ని తన మనసులో మాత్రమే దాచుకోలేదు. ప్రక్కయిళ్ళ ఆడవాళ్ళు ఇద్దరి ముగ్గురితో ఈ సంగతి చాటింది. ఆ పత్రికలు వాళ్ళకు చదవమని యిచ్చింది.

తర్వాత మధుబాబు కథలింకా విరివిగా రాయటం మొదలుపెట్టాడు.  రాయటం ఎక్కువయినాక పుస్తక పఠనం తగ్గింది. క్లాసులో పాఠాలు వినటంలేదు. ఇప్పుడు క్లాసు పుస్తకాలనిండా ఏదో ఇష్టం వొచ్చిన వ్రాతలు వ్రాయసాగాడు.

మరుసటి నెలకూడా మూడు నాలుగు కథలు ప్రచురించబడినై. స్నేహితులు మళ్ళీ పాత అభిప్రాయాల్ని కొత్త భాషలో వ్యక్తం చేశారు. అయితే  అతను రాసినవి పిల్లల కథలని ఎవరూ పొరబడకూడదు. తను పిల్లవాడినని అతను అనుకోవటంలేదు. రాసింది ఏ పత్రిక్కీ పంపించటానికి అతను సంతోషించటంలేదు. తిరిగి వచ్చినప్పుడు పడేబాధ వుండనేవుంది. తరుచు రాసేవాళ్ళలో అతనికి కొంతమంది అభిమాన రచయితలుండేవారు. వాళ్ళు తన దృష్టిలో చాలా గొప్పవాళ్ళుగా కనబడేవాళ్ళు. ఎన్నటికయినా తనకంతటి పేరు ప్రఖ్యాతులు వస్తాయా అని, ఆ స్థితికి ఎదగగలనా  అనీ ఉవ్విళ్ళూరుతూ వుండేవాడు.

పాఠకుల్లో ఓ వాడుక వుంది. ఒకసారి ఓ రచన ఒకరిది అచ్చయితే, యిక ఆ రచయిత పేరు చూడగానే సంపాదకులు ప్రచురించి వేస్తూ వుంటారనీ చదవనుకూడా చదివరనిన్నూ, మధుబాబుకూడా మొదటిలో ఈ విషయం విశ్వసించాడు. అందుకని తన కథలు వేసుకున్న పత్రిక్కి ఉత్సాహంగా పంపించాడు. కాని అతని అభిప్రాయం పొరపాటయింది. అవి నిక్షేపంగా తిరిగి వచ్చాయి. ఒకడు మరీ ప్రఖ్యాతుడు అవుతేగాని ఈ తిరిగి రావటం బెడద తీరదని నిట్టూర్చి ఊహించాడు. ఏ ఇతర రంగాల్లోనయినా ప్రజలు బ్రహ్మరథం పట్టి సాధారణంగా పైకెత్తి వేస్తారుగానీ  ఈ

కవులనీ, రచయితలనూ జీవితమంతా సంపూర్ణమయిన విజయము వరించదన్న సత్యాన్ని తెలుసుకునేందుకు అతనిది బొత్తిగా లేత వయస్సు.

నాలుగయిదు నెలలు గడిచేసరికి ఓ యిరవై కథలు దాకా అచ్చయినాయి. కానీ ఒక్కరుకూడా అతనికి దమ్మిడీ పంపలేదు. అతను ఆశించనూలేదు. నిజానికి రాసిన వాటికి డబ్బులు ముట్టుతాయన్న విషయం కూడా అతనికి తెలియదు. కానీ ఒకరోజు మొట్టమొదటగా వేసుకున్న వారి పత్రిక నుంచి మూడు రూపాయలు మని ఆర్డర్ వచ్చి అతన్ని సంభ్రమంలో ముంచెత్తింది. జీవితంలో మొట్టమొదటిసారిగా డబ్బు సంపాదించాడు. ఆ మొత్తం అల్పమా అధికమా అన్న మీమాంస అతనికి కలగలేదు. పోస్టుమేన్ అందులోనే ఓ బేడా కాజేశాడూ. మని ఆర్డర్ ఫారంలో చింపి యిచ్చిన అద్దుముక్క తీసుకువెళ్ళీ గర్వంగా స్నేహితుల ముందు పెట్టాడు. "ఏమిటి? ముష్టి మూడు రూపాయల పారితోషికమా? ఛీఛీ" అన్నారు వాళ్ళు. మధు బాబుకు ఉక్రోషం వచ్చింది.

"మరి ... చిన్నకథ" అన్నాడు బయటపడకుండా.

"కథలో వర్త్ వుండాలిగానీ చిన్నదయితేనేమి?" అన్నాడొకడు తేల్చి పారేసి. ఇంకొకడు సలహా ఇస్తూ "మిగతా రచయితలకి ముప్పయి రూపాయిలదాకా యిస్తూ వుంటార్రా. అసహ్యంగా మూడు రూపాయలేమిటి? తిరగగొట్టు" అన్నాడు.

మధుబాబుకి ఈ సలహా నచ్చలేదు. ఇది తిరగగొడితే తన అభివృద్ధికి ఆటంకం తెచ్చుకున్న వాడవుతాడు. అయినా ఈ డంబాలు పలుకుతున్న వారందరికీ ఒక్క దమ్మిడీ అయినాకూడా సొంతంగా సంపాదించటం చేతకాదు. జవాబు చెప్పకుండా అక్కడినుంచి వచ్చేశాడు.

తన సాహిత్య వ్యాసంగాన్ని గురించి తండ్రికి తెలియకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్నీ తీసుకున్నాడు. విశ్వనాధంగారయితే న్యూస్ పేపరు తప్ప విడిగా ఒక్క అక్షరం ముక్క చదవడు. అసలాయనకు తనకొచ్చే ఉత్తరాలు చదువుకోవటమే బద్ధకం. కానీ ఆయన స్నేయితులంతా రకరకాల వ్యాపకాల వాళ్ళు. మధుబాబు పేరుని వాళ్ళు పత్రికలలో చాలాసార్లు చూడటం తటస్థించింది.

"కానీ ఈ కుర్రవాడు రాస్తున్నాడా? ఎవడో ఇంకొకడికి ఇదే పేరు, ఇంటిపేరూ కలిసి వచ్చింది" అనుకున్నారు.

కానీ తరచు కనిపిస్తుండేసరికి సంశయం వచ్చి చివరకు సుబ్రహ్మణ్యం అనే ఆయన మాటల సందర్భంలో విశ్వనాధం గారిని అడిగాడు.

"వాడా! వాడి మొహం అచ్చయేపాటి సామర్ధ్యం వాడికెక్కడ వుంది?" అని విశ్వనాధంగారు బయటికి అన్నారు. కానీ అనుమానం వేసింది కొంచెం. కొడుక్కి వున్న పిచ్చి ఆయనకు తెలుసుకదా.

సుబ్రహ్మణ్యంగారు వెళ్ళిపోయాక ఇంట్లోకి వచ్చి భార్యను అడిగాడు.

"బాబు కథలు రాస్తున్నాడా?"

ఆ సమయానికి ఆవిడ ఇంట్లోకి వెచ్చాలు ఏం కావాలో రాస్తోంది. చేస్తున్న పని ఆపి "అవును" అంది భయంగా.

"మరి నాకెందుకు చెప్పలేదు?" అన్నాడాయన.

ఆవిడ బదులు చెప్పలేదు. తలవంచుకుని కూర్చుంది.

"కోప్పడతాననా" అన్నాడాయన మెల్లగా.

ఆవిడ తల వూపింది.

నిజానికప్పుడు విశ్వనాధంగారికి కోపం రాలేదు. కాలేజీలో పెట్టిన పరీక్షలలో కొడుక్కి బాగానే మార్కులు వస్తున్నాయి. బాగానే చదువుతున్నట్లున్నాడు.

"అప్పుడప్పుడూ కథలు రాస్తే పోయిందేమిటి?" అనుకున్నాడు. అదే పిచ్చిగా పెట్టుకోకూడదు. మొట్టమొదట చదువు, తరువాత యీ వ్యాపకం. హాబీ క్రింద తీసుకోవచ్చు.

భార్యతో యిలా అన్నాడు. "వాడు చదువు పాడుచేసుకోకుండా రాసుకుంటే నేనెందుకు కోప్పడతాను? కానీ తల్లీ కొడుకులిద్దరూ నాకు తెలీకుండా గుళ్ళ కాషాయం చేస్తే నాకు కోపం వస్తుంది. నాకు యిష్టంలేని పని అసలు చెయ్యకూడదు. చేసినా చాటు మాటున అసలు చెయ్యకూడదు నన్ను గట్టిగా అడిగితే అప్పుడప్పుడూ రాసుకొనమని నేనే అని వుండేవాడినిగా."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments